


# లేడీ ఇన్‌స్పెక్టర్

-ఎన్.ఎక్. కాళిదాస్

**మార్కెట్ రోడ్ అసలే ఇరుకు. ఆపై సైకిళ్ళు మొదలు లారీల వరకు రోడ్డుకు అటుఇటు ఆపేయడంతో ఇంకా ఇరుకైపోయింది. వినాయకచవితి నాలుగురోజుల్లో ఉండడంతో మార్కెట్ రోజూ కంటే రద్దీ అయిపోయింది. ఎవరి గోల వారిది. ఒక్క మాట కూడా సరిగ్గా వినబడ్డం లేదు. అంతకు ముందు రోజు నాలుగు చినుకులు నేలరాలడంతో చిత్తడిచిత్తడిగా ఉంది. పండగన్నాక తప్పదు కదా!**

నర్సయ్య ఇలాంటి పండగ మార్కెట్లను ఏళ్ళు తరబడి చూస్తూనే ఉన్నాడు. వయసెంత అని ఆయన్నెవరైనా అడిగితే 60 దాటి ఉంటుందంటాడు. ఆ మార్కెట్లో షాపులు కట్టక ముందు నుంచీ గంపల మీద కూరలు పెట్టి అమ్మినవాడు నర్సయ్య. ఆయన కళ్ళ ముందే పల్లె పట్నమై పోయింది. గంపలు కాస్తా షాపులుగా మారిపోయాయి. బికారీగా ఉన్న వాళ్ళెందరో కోటీశ్వరులై పోయారు. కోట్లకు పడగలెత్తిన వాళ్ళు నేల కూలిపోయారు. మారనిది నర్సయ్య జీవితమే. అయినా నర్సయ్య ఏం బాధపడడు. ఉన్నవూరు కన్నతల్లితో సమానం అని నమ్మిన మనిషి అతను. ఊళ్ళో జనానికి పండగ వస్తే తనకూ పండగే కదా అని అనుకునే రకం. అయితే ఏయేటి కాయేడు వ్యాపారం తగ్గిపోతుండడం మాత్రం అతను గమనిస్తూనే ఉన్నాడు. పండగలు చేసుకునేంత ఓపిక పట్నంలో జనానికి లేదేమో అనుకున్నాడు మొదట. రోజు గడవడమే కష్టమైతే పండగలకు పబ్బాలకు డబ్బులెక్కడ ఖర్చు పెట్టగలరని తరువాత తెలుసుకున్నాడు.

పరధ్యానంలో ఉన్న నర్సయ్య అలజడి రేగడంతో ఈ లోకంలోకి వచ్చాడు: షాపుల ముందు నిల్చున్న వాళ్ళంతా పక్కకు జరుగుతున్నారు. కొందరైతే ఎందుకొచ్చిన కూరలని నెమ్మదిగా పలాయనం చిత్తగిస్తున్నారు. నర్సయ్యకు అర్థమై పోయింది - దాదా వస్తున్నాడని.

'మా బతుకులే మాకు కష్టంగా ఉంటే వీడొకడు. రాక్షసుడిలా దాపురించాడు - మాపాలిటికి' అని పక్క షాపులవాళ్ళు అనడం వినిపించిందతనికి.

ఊరికే ఉండండి. మనకిది అలవాటేగా. వాడేదో పదో పరకో అడుగుతాడు. మనకు తోచింది ఇస్తాం. వాడు మళ్ళీ పండక్కు వస్తాడు. నోరు పారేసుకుని మనం సాధించేదేమిటి? అని పక్కనున్న వాళ్ళకు సర్ది చెప్పడానికి ప్రయత్నించాడు నర్సయ్య.'

ఈలోపు మందీ మార్బలంతో దాదా రానే వచ్చాడు.

'ఒక్కొక్కరు వంద రూపాయలు తీసి ఉంచండి. ఇలా తెచ్చి అలా అమ్మేసి లక్షలు సంపాదిస్తున్నారు. వంద రూపాయలివ్వడానికి ప్రాణం పోయినట్లు ఏడ్చి ఛస్తారు... ఊ... ఎవ్వర్నీ

వదలద్దు... గుంజండ్రా అందరి దగ్గరి నుంచి' అంటూ దాదా హుంకరించాడు.

చెప్పకనే చేతిని మింగేసే అతడి శిష్యగణానికి ఇంక చెప్పాలా? కోడి కెలికినట్లు గల్లాపెట్టెలు కెలికి మరీ వసూలు చేసుకోగలిగిన సమర్థులు వారు.

'పొద్దునేమో పండగ మామూళ్ళని పార్టీల వాళ్ళు షాపులు కూడా తెరవక ముందే డబ్బు లాక్కుపోయారు. ఇదేమిటయ్యా రౌడీలకు మీకు తేడా ఏమిటని అడిగితే - వాళ్ళేదన్నా చేస్తే రక్షణ ఇవ్వాల్సింది మేమే కదా అందుకే మాకివ్వండి అన్నారు. కూరగాయలు లారీల్లోంచి దించేప్పుడు గంపల కెత్తేటప్పుడు సగం దెబ్బతిని పోతాయి. రెండ్రోజులు నిలువ ఉంటే పుచ్చిపోతాయి. కుళ్ళిపోతాయి. ఆ నష్టమంతా మనమే భరించాలి. ఇవన్నీ ఎవడూ పట్టించుకోడు. పొద్దున లీడర్ల వెంట వచ్చినవాళ్ళే ఇప్పుడు దాదా వెంట ఉన్నారు. అంతా మన ఖర్మ' అని తిట్టుకుంటున్నారు.

కొట్లాడే ఓపిక లేకపోయినా నర్సయ్య వైపే అందరూ దీనంగా చూడడంతో ఆయనే కదిలాడు.

'డబ్బుల్ తియ్యమంటే మొహాలు చూస్తారేంది బే! ఆటలుగా ఉందా? శాల్తీ లేచిపోతాయ్' అన్నాడు దాదా.

నర్సయ్య నెమ్మదిగా పెదవి విప్పాడు 'ఇవ్వాలనే ఉంది బాబూ! మాకే వ్యాపారం సరిగ్గా లేకపోతే మీకేమిస్తాం చెప్పు... ఒక్కొక్కరు వంద ఇవ్వలేం గానీ ఉన్న షాపుల వాళ్ళందరం కలిసి అయిదొందలిస్తాం. ఎలాగో వదిలిపెట్టు' అన్నాడు.

అప్పటికే దాదాకు వొళ్ళు మండుతోంది. ఓపిక పట్టలేక - 'ఉన్నవి వంద షాపులు. అయిదొందలిచ్చి చేతులు దులుపుకుంటే నేనేం అమాయకుడ్నా? నాతో పెట్టుకోకండి అనవసరంగా' అంటూ ఏదో సైగ చేశాడు.

కూరల గంపలన్నీ కిందా మీదా అవుతున్నాయి. అసలే చిత్తడి నేల. నుజ్జునుజ్జు అయిన కూరలతో మరింత. చిత్తడిగా తయారైంది. విధిలేక నర్సయ్య దాదా కాళ్ళు పట్టుకున్నాడు. 'ఏదో వారికి తెలీక నీతో మాటలు పెట్టుకున్నారు. వదలిపెట్టు బాబూ' అంటూండగానే దాదా నర్సయ్యను కాలితో తన్నాడు. కర్ర తీసుకుని చితకబాదాడు. నర్సయ్య మనవడు ఏడుస్తున్నాడు. అందరూ చోద్యం చూస్తున్నారే కానీ దాదాను ఆపలేదు. ఊహించని రీతిలో దాదా నెత్తిన పిడుగుపాటులా పోలీసు లాఠీ పడింది.

అంతే కళ్ళు గిర్రున తిరిగి పడిపోయాడు.

వెంటనే నర్సయ్యను ఆసుపత్రికి తీసుకెళ్ళారు. పదేళ్ళుగా దాదాను ఒరే అన్నవారు లేరు. వాడ్ని పోలీసులు తీసుకెళ్ళారని తెలియగానే మార్కెట్ వారికి పండగ ముందే వచ్చినట్లయింది. 'ఆ ఇది మామూలే. కొత్త ఇన్‌స్పెక్టర్ వచ్చినప్పుడు అలా పట్టుకెళ్తారు. వాడు మన దగ్గర గుంజిన డబ్బులో వాటా ఇస్తాడు. వెంటనే వదిలేస్తారు. ఇది మనకు తెలియంది కాదు గదా!' అంది రాములమ్మ. ఆమెకూ్కడా 60 ఏళ్ళ పైనే ఉంటాయి.

★ ★ ★

కాలుగాలిన పిల్లిలా దాదా లాకప్ సెల్లో అటూ ఇటూ తిరుగుతున్నాడు. 'అడిగినప్పుడల్లా మామూళ్ళిస్తూనే ఉన్నాను కదా! ఎవడ్రా నన్ను లోపల పెట్టమంది' అన్నాడు. 'కొత్త ఇన్‌స్పెక్టర్ సార్' వినయంగా సమాధానమిచ్చాడు కానిస్టేబుల్.

'అంత ధైర్యమున్న వాడెవడు బే. రాగానే నన్ను కలిస్తే వాటాలు కుక్కకు పడేసినట్లు పడేస్తాను కదా. అయినా వాడ్ని అరక్షణంలో బదిలీ చేయిస్తాను చూడండి' అంటూ సెల్ దగ్గరికొచ్చిన కొత్త ఇన్‌స్పెక్టర్‌ను చూసి విస్తుపోయాడు దాదా. కొత్త ఇన్‌స్పెక్టర్ మగవాడు కాదు. ఆడమనిషి.

'ఊరికి కొత్తలాగున్నావ్. నా కథ తెలీదేమో. డిపార్ట్‌మెంట్‌లో నాకు తెలియని వాళ్ళు లేరు. నీ మేలు కోరి చెప్తున్నా. నన్నొదిలేయ్. లేకపోతే బయట గొడవలు జరిగిపోతాయ్. ఆ పైన ఊరు వల్లకాడవుతుంది' అన్నాడు.

కొత్త ఇన్‌స్పెక్టర్ కల్పనకు అవేం వినిపించలేదు.

ఈలోపు లాయరొచ్చాడు. జామీను అంగీకరించను. రేపు కోర్టులో చూసుకో పొమ్మని చెప్పింది. విషయం ఊరు ఊరంతా పాకిపోయింది. ఛార్జి తీసుకున్న అరగంటలో అసలైన మనిషిని బోనులో పెట్టిందని అభినందిస్తున్న వారు కొందరు. దాదా లోపలుంటే మన పనులెలా జరుగుతాయని బాధపడుతున్న వారు మరి కొందరు. ఊళ్ళో పెద్ద తలకాయలన్నీ తర్జన భర్జనలు ప్రారంభించాయి.

★ ★ ★

స్టేషన్ ముందంతా జనమే. మార్కెట్ మనుషులే ఎక్కువగా ఉన్నారు. తమ పాలిటి రాక్షసుడ్ని బోనులో పెట్టిన ఎస్.ఐ - అందునా ఆడమనిషి ఎలా ఉంటుందోనని చూడాలన్నది వారి ఉబలాటం. తొక్కిసలాట ఎక్కువ కావడంతో-

'మేడం మిమ్మల్ని చూడాలని జనం చాలామంది వచ్చారు. ఒకటే తొక్కిసలాట. ఇంకొద్ది సేపయితే లాఠీ ఛార్జ్ చేయాల్సి ఉంటుంది' అన్నాడు కానిస్టేబుల్.

అయిష్టంగానే బయటికొచ్చి చేతులెత్తి నమస్కరించి 'నేనేం సినిమా హీరోయిన్‌ను కాను. మీకింక దాదా భయంలేదు వెళ్ళండి' అంది కల్పన.

వాళ్ళంతా మార్కెట్ దాకా వెళ్ళారో లేదో అప్పుడే పాక్కిపోయింది - కొత్త ఎస్.ఐ ట్రాన్స్‌ఫర్ అయ్యిందట. రాత్రికి దాదా బయటికి వచ్చేస్తున్నాడట - అని. మార్కెట్ జనానికి పొంగు మీద నీళ్ళు చల్లినట్లయ్యింది. రాములమ్మ 'ముందే చెప్పానుగా ఇదింతే' అని నిస్పృహాయంగా అంది. నర్సయ్య ఏదో ఆలోచనలో పడ్డాడు. ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే ప్రయోజనం లేదు. అమీతుమీ తేల్చుకోవాలనుకున్నాడు. ఎవరెవరికి ఏం చెప్పాడో తెలీదుగానీ - అరగంటలో పోలీసుస్టేషన్ ముందు దృశ్యం మారిపోయింది.

'కొత్త ఎస్.ఐ బదిలీ నిలుపుదల చేయాలి. దాదాను శిక్షించాలి' అన్న నినాదాలున్న బ్యానర్లతో ఆమరణ నిరాహారదీక్షల శిబిరం వెలిసింది. నర్సయ్య మెడలో పూలమాలలు వాడుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు నర్సయ్యతో కలిసి ఫోటోలు దిగాయి. కూలీలందరూ నర్సయ్య వెంటే నిలిచారు.

పట్నంలో పెద్ద తలకాయలు మళ్ళీ చర్చలలు జరిపాయి. వోట్లు, ఇమేజి లెక్కల ప్రకారం ఈసారి దాదాను రక్షిస్తే వచ్చే నెల ఎన్నికల ఫలితాలు తారుమారవుతాయని భయపడ్డాయి. కల్పన బదిలీ ఆగిపోయింది. దాదా బయటికి రాలేదు. జనం మేమే గెలిచామని నిమ్మరసం తాగి ఆనందోత్సాహాలు చేసుకున్నారు. నిజానికి గెలుపు కల్పనదీ కాదు - జనానిదీ కాదు.

దాదా అవసరం అధికార పార్టీ పెద్దాయనకు తీరింది. వాడ్ని భరించలేక అవకాశం కోసం పెద్దాయన ఎదురుచూస్తున్నాడు. రోగి కోరిందీ వైద్యుడు చెప్పిందీ ఒకటే అయినట్లు కల్పన రాకతో పెద్దాయన పని సులువైంది. మరి గెలుపెవరిది?